

ఆర్థికంగా ఎదగాలి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. 8లో ▸




సేవలు మరువలేనివి

దేశ స్వాతంత్రం కోసం భగత్‌సింగ్ ప్రాణ త్యాగం చేశారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో ▸



బైక్‌ను ఢీకొట్టిన కారు

కడ్తాల్ సమీపంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 8లో ▸



ట్యాంక్‌బండ్‌పై మహాగణపతి



సరూర్‌నగర్ చెరువు కట్టపై నిమజ్జన కోలాహలం



బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర

వెళ్లి మళ్లీ రావయ్యా..

ప్రశాంతంగా కొనసాగిన శోభాయాత్ర

- భక్తిశ్రద్ధలతో గణనాథుల తరలింపు
- స్థానిక చెరువుల్లో నిమజ్జనం
- ఎటుచూసినా భక్తుల కోలాహలం
- పోటాపోటీగా లడ్డూ వేలం పాటలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా/బడంగ్‌పేట్: గణేశ్ నిమజ్జన మహా ఘట్టం గురువారం ప్రశాంతంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజించిన గణనాథులను ప్రత్యేక పూజలు నిర్వహించి.. మేళ తాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. చిన్నారులు, యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ‘జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపతి బొప్పా మోరియా’ అంటూ హోరెత్తించారు. మండపాల వద్ద వేలం పాటలు జోరుగా నిర్వహించారు. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. అన్నదానాలు, ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది. అందంగా ముస్తాబు చేసిన వాహనాల్లో గౌరీ తనయుడిని గంగ చెంతకు తరలించారు. సరూర్‌నగర్, తుర్కయంజాల్ మాసబ్ చెరువు సహా జిల్లా వ్యాప్తంగా 44 చెరువులు, కుంటల్లో నిమజ్జనోత్సవం కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయం ఐదు గంటలకే షురూ

బాలాపూర్ గణనాథుడికి ఉదయం ఐదు గంటలకే పూజలు చేశారు. అనంతరం వాహనంపై విగ్రహాన్ని ఉంచి మేళ తాళాలు, డప్పుల దరువులతో గ్రామంలో ఊరేగించారు. ఉదయం 8.30 గంటలకు శోభాయాత్రం బొడ్రాయి వద్దకు చేరుకుంది. 9 గంటలకు వంగేటి లక్ష్మారెడ్డి లడ్డూ వేలం పాట ప్రారంభించారు. వేలం పాటలో ఏడుగురు భక్తులు పేర్లు నమోదు చేసుకున్నారు. అరగంట పాటు వేలం పాట పోటాపోటీగా సాగింది. గత ఏడాది లడ్డూను రూ. 24.60 లక్షలకు సొంతం చేసుకున్న బాలాపూర్ వాసి వంగేటి లక్ష్మారెడ్డి వేలం పాట డబ్బులను ఉత్సవ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం లడ్డూను దక్కించుకున్న దయానంద్‌రెడ్డిని గుర్రపు బండిలో ఎక్కించుకుని మేళతాళాలతో ఊరేగించి హనుమాన్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గంగమ్మ ఒడికి గణపయ్య



ఉత్సాహంగా నిమజ్జనానికి..



కారుపై నిమజ్జనానికి గణనాథుడు

చకచకా.. బాలాపూర్ శోభాయాత్ర

ప్రత్యేక పూజలు, వేలం పాట పూర్తయిన తర్వాత ఉదయం 9.30 గంటలకు బాలాపూర్ శోభాయాత్ర మొదలైంది. అశేషభక్త జనం వెంటరాగా గణనాథుడి వాహనం ముందుకు కదిలింది. మల్లాపూర్, చంపాపేట్, పాతబస్తీ సహా ఇతర ప్రాంతాల్లో నెలకొల్పిన విగ్రహాలు అనుసరించాయి. శోభయాత్ర మధ్యాహ్నం 1.53 గంటలకు బార్కాస్.. 2.30 గంటలకు చార్మినార్.. 3 గంటలకు ఎంజే మార్కెట్ మీదుగా 3.50 గంటలకు బషీర్‌బాగ్ దాటింది. సాయంత్రం 4.30 గంటలకు ట్యాంక్‌బండ్ చేరుకుంది. దారి పొడవునా భక్తులు నీరాజనం పలికారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చార్మినార్ సహా పలు ప్రముఖ కూడళ్లలో స్వాగతం పలికారు. సరిగ్గా 4.50 గంటలకు నిమజ్జన ప్రక్రియ పూర్తయింది. బాలాపూర్ చరిత్రలో ఇంత తక్కువ సమయంలో నిమజ్జనం పూర్తి కావడం ఇదే తొలిసారి. అనుకున్న దానికంటే ముందే నిమజ్జనం పూర్తి కావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పాతబస్తీలో పలువురు ముస్లింలు శోభయాత్రలో పాల్గొన్న భక్తులకు తాగు నీరు, మజ్జిగ సరఫరా చేశారు.

లడ్డూలు.. ‘లక్ష’ణంగా..

- బాలాపూర్ గణనాథుడి లడ్డూను తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని పాటిగూడకు చెందిన రియల్ వ్యాపారి, రైతు దాసరి దయానంద్‌రెడ్డి రూ.27 లక్షలకు కైవసం చేసుకున్నారు.
- చేవెళ్లలో ఏర్పాటు చేసిన రచ్చబండ వినాయకుని లడ్డూను రూ.22.11 లక్షలకు కేటీఆర్ గ్రూప్ సభ్యులు దక్కించుకున్నారు.
- బడంగ్‌పేట్ వీరాంజనేయ భక్త సమాజం గణనాథుని లడ్డూను మాజీ ఉప సర్పంచ్ పెద్దబావి వెంకట్‌రెడ్డి రూ.17 లక్షలకు దక్కించుకున్నారు.
- ఆదిబట్ల మున్సిపల్ కేంద్రంలో చైతన్య యూత్ (బురుజు) వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కోరె కళమ్మ రూ.12.5 లక్షలకు దక్కించుకున్నారు.
- ఫరూఖ్‌నగర్ మండలం మధురపురం రెడ్డి సేవా సమితి వినాయక లడ్డూను అదే గ్రామానికి చెందిన శేరి పర్వతరెడ్డి రూ.11,51,000కు దక్కించుకున్నారు.
- మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో గణపతి లడ్డూను రూ.6.15లక్షలకు పి.మధుకర్‌రెడ్డి దక్కించుకున్నారు.
- జిల్లెలగూడ నవయుగ యూత్ అసోసియేషన్ లడ్డూను కొత్తకాపు శ్రీనివాస్‌రెడ్డి బ్రదర్స్ రూ.6 లక్షలకు దక్కించుకున్నారు.
- చేవెళ్ల మండలం గుండాలలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను రూ.6లక్షలకు కె.విష్ణువర్ధన్‌రెడ్డి కైవసం చేసుకున్నారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూను రూ.4.12 లక్షలకు పురుషోత్తం, ప్రశాంత్ దక్కించుకున్నారు.
- మణికొండ పంచవటి కాలనీ వినాయకుడి పెద్ద లడ్డూను దిలీప్‌రెడ్డి రూ.5.59 లక్షలకు, ఇదే మండపంలో మహిళలు ఏర్పాటు చేసిన చిన్న లడ్డూను వాసంతి శిరీష, రామసుబ్బారెడ్డి దంపతులు రూ.2.90 లక్షలకు, చిన్నారులు ఏర్పాటు చేసిన లడ్డూను చరిష్మారెడ్డి రూ.3.25 లక్షలకు సొంతం చేసుకున్నారు.
- మొయినాబాద్ మండల పరిధిలోని బాకారంలో రిటైర్డ్ సేల్స్ టాక్స్ ఆఫీసర్ సంగం రమేశ్ 5.25లక్షలకు కైవసం చేసుకున్నారు.
- నెక్నాంపూర్ వినాయకుడి లడ్డూను ఎర్రోళ్ల శంకర్ రూ.5లక్షలకు కైవసం చేసుకున్నారు. అలకాపూర్ పీవీఎస్ అసోసియేషన్ వినాయకుడి లడ్డూను అదే ప్రాంతానికి చెందిన సాయిరాం ముదిరాజ్ రూ.3.11 లక్షలకు దక్కించుకున్నారు.
- మీర్‌పేట కూడలిలోని లడ్డూను రూ.3.51 లక్షలకు సునీల్‌గౌడ్ సొంతం చేసుకున్నారు.
- మొయినాబాద్‌లోని విజయ్‌నగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి చేతిలోని మొదటి లడ్డూను రూ.3 లక్షలకు కాలనీకి చెందిన పాపిరెడ్డి, రెండో లడ్డూను పాటి మాధవరెడ్డి రూ.2.30 లక్షలకు దక్కించుకున్నారు.
- చిత్రపురి కాలనీ ఎంఐజీ వినాయకుడి లడ్డూను హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ రూ.2.51 లక్షలకు దక్కించుకున్నారు.
- విజ్ఞానపురి కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లడ్డూను మనోజ్‌కుమార్ రూ.2.22 లక్షలకు సొంతం చేసుకున్నారు.
- పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్ వెంకటేశ్వర కాలనీలో నెలకొల్పిన గణేశ్ లడ్డూను మారెల్లి జితేందర్‌రెడ్డి రూ.2,04,116లకు దక్కించుకున్నారు.
- మణికొండ శివపురి కాలనీ లడ్డూను అర్జున్ రూ.1.85 లక్షలకు దక్కించుకున్నారు.
- కడ్తాల్ మండలం గడ్డమీదితండా లడ్డూను రూ.1.67 లక్షలకు తుల్జాభవానీ యూత్ సభ్యులు కైవసం చేసుకున్నారు.
- యాచారం మండలం నందివనపర్తి అనుబంధ గ్రామం బొల్లిగుట్టతండా లడ్డూను మాజీ ఎంపీపీ వర్త్యవత్ రజిత, రాజునాయక్ దంపతులు రూ.1.65 లక్షలకు దక్కించుకున్నారు. యాచారం శ్రీ వేంకటేశ్వర స్వామి కాలనీలో ఏర్పాటు చేసిన లడ్డూను అదే ప్రాంతానికి చెందిన నక్క శంకర్ రూ.1.01 లక్షలకు దక్కుంచుకున్నారు.
- ముచ్చర్లలో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.1.35 లక్షలకు గ్రామానికి చెందిన కిషన్ సొంతం చేసుకున్నారు.
- శేరిగూడలోని హనుమాన్ ఆలయంలోని లడ్డూను వర్కాల శ్రీరాములుగౌడ్ రూ.1.26 లక్షలకు దక్కించుకున్నారు.
- కందుకూరు దెబ్బడగూడలో రూ.1.10 లక్షలకు శ్రీనివాస్ దక్కించుకున్నారు.
- శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సాయినగర్ కాలనీ గణనాథుడి లడ్డూను మహాలింగపురానికి చెందిన మహారాజ్‌పేట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాహేర్ రూ.23,100కు కైవసం చేసుకున్నారు.



చేవెళ్లలో వినాయకుని లడ్డూను రూ.22.11 లక్షలకు దక్కించుకున్న కేటీఆర్ గ్రూప్ సభ్యులు

న్యూస్‌రీల్

ప్రజల ఆత్మగౌరవం కోసమే భవనాలు

మంత్రి సబితారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: ప్రజల కోరికలకు కార్యరూపమే అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణమని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఈ–సిటీ వేంకటేశ్వర స్వామి, జిన్నాయిగూడ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాల అభివృద్ధి పనులకు, రావిర్యాలలో ఆయా కుల సంఘాల భవనాల నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపటానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. పరిశ్రమల శాఖకు సంబంధించిన విలువైన భూమిని మంత్రి కేటీఆర్ సహకారంతో కులసంఘాల భవనాలకు కేటాయించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.15 కోట్లతో కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రావిర్యాలలో రోడ్ల అభివృద్ధికి రూ.4 కోట్లు, డ్వాక్రా భవనాలకు రూ.80 లక్షలు, ఆస్పత్రి, యువతకు క్రీడామైదానాలను మంజూరు చేస్తున్నామన్నారు. డబుల్ బెడ్రూంలపై ప్రతిపక్ష పార్టీలు విద్వేషాలు రెచ్చగొట్టి, కులమతాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాయని దుయ్యబట్టారు. పేదలకు ఇళ్లు ఇస్తుంటే కోర్టులకు పోయి అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కందుకూరులో 450 పడకలతో మెడికల్ కళాశాలకు అక్టోబర్ 1న శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. రూ.8 కోట్లతో నియోజకవర్గంలోని పురాతన దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, ఆలయాల చైర్మన్లు శ్రీనివాస్, శివశంకర్, డీఈఈ యాదయ్య, ఏఈఈ కె.భార్గవ్‌రెడ్డి, దేవాదాయ, మున్సిపల్ శాఖ అధికారులు, ఆయా కులసంఘాల అధ్యక్షులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో పోలీసుల నృత్యాలు



సాక్షి, సిటీబ్యూరో: బందోబస్తు విధులతో అలసిపోయిన పోలీసులు నృత్యాలతో కాసేపు సేదతీరారు. ట్యాంక్‌బండ్ వద్ద వినాయక నిమజ్జనంలో గ్రేటర్ పోలీసులు డీజే ఆటపాటలతో డ్యాన్స్‌లతో ఇరగదీశారు. వీటిని పలువురు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఆ వీడియోలు తెగ వైరల్‌గా మారాయి. నిమజ్జనంలో పోలీసులు నృత్యం చేయడంపై భిన్నాభిప్రాయాలతో నెటిజన్లు కామెంట్లు పెట్టారు. ఇదిలా ఉండగా.. మరోవైపు వినాయక నిమజ్జన వేడుకలను ఇళ్లల్లో టీవీల ముందు, సోషల్ మీడియాలో ఫాలో అయ్యారు. ట్యాంక్‌బండ్ నిమజ్జన సరళిపై గ్రేటర్ పోలీసులు ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్‌డేట్ చేశారు. ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్, బాలాపూర్ వినాయక నిమజ్జనాలు సాగుతున్న తీరును, ప్రయాణ మార్గం, జన సందోహం, పూజలు తదితర ఏర్పాట్లపై పోలీసులు నిరంతరం పోస్ట్‌లు పెట్టారు. వినూత్న రీతిలో, విభిన్నంగా ఉన్న గణేష్ ప్రతిమలను షేర్ చేశారు. ప్రత్యేకంగా ఖైరతాబాద్ వినాయక నిమజ్జనం, బాలాపూర్ లడ్డు వేలంపై ఎప్పటికప్పుడు ఫొటోలు, వీడియోలతో ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాలో పోస్ట్‌లు చేశారు.

మళ్లీ మాదే అధికారం



సీతారాంపూర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

- పరిశ్రమల ఏర్పాటుతో మారుతున్న షాబాద్ రూపురేఖలు
- సీతారాంపూర్ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసుకుందాం
- ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

షాబాద్: రెండు నెలల తర్వాత తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మండల పరిధిలోని సీతారాంపూర్, చందనవెల్లి గ్రామాల్లోని పారిశ్రామికవాడలో పలు కంపెనీలకు శంకుస్థాపనలు చేసేందుకు గురువారం ఆయన హాజరయ్యారు. సీతారాంపూర్ వద్ద జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సీతారంపూర్ చౌరస్తా వద్ద సమాచార, పౌరసంబంధాలు, గనులశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పైలెట్ రోహిత్‌రెడ్డితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. చందనవెల్లి, సీతారాంపూర్ పరిశ్రమల్లో తయారు చేసే టైల్స్ ప్రపంచం నలుమూలలా సరఫరా కావడం గొప్ప పరిణామమన్నారు. చందనవెల్లిలో చిన్న ప్లాట్ల సమస్య ఉందని, దానిని త్వరలో పరిష్కరించుకుందామన్నారు. సీతారాంపూర్ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. యువతకు స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ నాలుగు కాదు 40, 50 పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మరో ఐదేళ్లలో షాబాద్ మండలం ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మరోసారి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. దేశం మొత్తం షాబాద్ వైపు చూస్తోందన్నారు. ఎక్కడా లేని అభివృద్ధి పరిశ్రమల ద్వారా ఇక్కడ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు శ్రీకాంత్, మాలతి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మద్దూర్ మల్లేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

హష్ ఆయిల్ పట్టివేత

- విలువ రూ.15 లక్షలు!
- పోలీసుల అదుపులో నిందితుడు

చేవెళ్ల: విశాఖపట్నం నుంచి హష్ ఆయిల్‌ను తరలిస్తున్న వ్యక్తిని ఎస్‌ఓటీ పోలీసులు, చేవెళ్ల పోలీసులు కలిసి పట్టుకున్నారు. అతని నుంచి రూ.15లక్షల విలువ చేసే లిక్విడ్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన చేవెళ్లలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. విశాఖపట్నం జిల్లా పెద్దవెల్లి మండలం, మల్లేపెట్టు గ్రామానికి చెందిన పాత్రంగి రత్నం, అదే జిల్లాలోని బొర్రనేరోడు గ్రామానికి చెందిన బాబురావు(33) హష్ ఆయిల్‌ను తయారుచేసి హైదరాబాద్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈనెల 25న పాడేరులో కలుసుకున్న వీరు లిక్విడ్‌ను అమ్మే విషయం చర్చించారు. ఒప్పందం ప్రకారం బాబురావుకు 3 కిలోల ఆయిల్ ఇచ్చి హైదరాబాద్‌లో అమ్మకొని రావాలని చెప్పిన రత్నం అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడలో దింపాడు. ఆ రోజు రాత్రికి అక్కడే ఉండి మరుసటిరోజు హైదరాబాద్ వెళ్లమని చెప్పి వెళ్లిపోయాడు. బాబురావు లిక్విడ్‌ను తీసుకొని 26న సాయంత్రం హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌కు వచ్చాడు.

పోలీసులకు చిక్కాడిలా..

వినాయక నిమజ్జనాల సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు ఉన్నట్లు గమనించిన బాబురావు హైదరాబాద్‌లో అమ్మడం కుదరదని సమీపంలోని నగరాల్లో అమ్ముకోవాలని భావించాడు. 27న హైదరాబాద్ నుంచి బస్సులో చేవెళ్లకు వచ్చాడు. చుట్టుపక్కల ఎక్కడైనా అమ్ముకోవాలని బ్యాగులో ఆయిల్‌ను పెట్టుకొని తిరుగుతున్నాడు. అప్పటికే రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో చేవెళ్ల పోలీసుల సహకారంతో చేవెళ్ల మార్కెట్ యార్డు సమీపంలో తిరుగుతున్న అతన్ని పట్టుకున్నారు. విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పటంతో అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా లిక్విడ్‌ను గుర్తించారు. అతని నుంచి ఆయిల్‌తోపాటు సెల్‌ఫోన్, పర్సును స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ డీసీసీ జగదీశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షణలో చేవెళ్ల పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు కలిసి కేసును ఛేదించినట్లు చెప్పారు.



పట్టుబడిన ఆయిల్

సీపీ.. సింపుల్‌గా..

- మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన సీపీ ఆనంద్
- నిరాడంబరంగా ఇంట్లోనే నిమజ్జనం



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తన ఇంటి వినాయకుడిని నిరాడంబరంగా గురువారం ఉదయం నిమజ్జనం చేశారు. ఇంట్లో దాదాపు అడుగు ఎత్తున్న మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన ఆనంద్ కుటుంబీకులు పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం విగ్రహాన్ని ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చిన ఆనంద్ ఆ ప్రాంగణంలోనే ఖాళీ పూల కుండీలో ఉంచి నీళ్లు పోశారు. నిమజ్జనం అనంతరం గణేశుడిని పూజించారు. ఈ వీడియోను ‘ఎక్స్’లో పోస్టు చేసిన సీపీ.. ‘ఇంట్లోనే మట్టి గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశా. కుండలో మిగిలిన మట్టిలో నా భార్య ఒక చెట్టును నాటారు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుంది’ అని ట్వీట్ చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.


బడంగ్‌పేట్: రూ.17 లక్షలకు లడ్డూను దక్కించుకున్న వెంకట్‌రెడ్డి


మొయినాబాద్ రూరల్: బాకారంలో రూ.6.15 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న మధుకర్‌రెడ్డి


కడ్తాల్: రూ.1.67 లక్షలకు లడ్డూను దక్కించుకున్న తుల్జాభవానీ యూత్ సభ్యులు


మొయినాబాద్: లడ్డూను కైవసం చేసుకున్న భక్తులు

లడ్డూ.. అధరహో..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా పూజలందుకున్న గణనాథుని చేతుల్లోని లడ్డూల వేలంపాట గురువారం కొత్త రికార్డులు సృష్టించాయి. బాలాపూర్ గణేశ్ నుంచి మొదలుపెడితే.. గల్లీ గణేశ్ వరకు లడ్డూలు రూ.లక్షల్లో పలికాయి. వేలంపాటలో నాయకులు, వ్యాపారవేత్తలు, కులమతాలకతీతంగా లడ్డూ కోసం పోటీపడ్డారు. లడ్డూ దక్కించుకున్న వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

– సాక్షి, నెట్‌వర్క్


మొయినాబాద్‌రూరల్: రూ.5.25 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న రమేష్


శంకర్‌పల్లి: రూ.23 వేలకు లడ్డూను దక్కించుకున్న తాహెర్ అలీ


యాచారం: రూ.లక్ష 65వేలకు లడ్డూను దక్కించుకున్న రజిత, రాజునాయక్ దంపతులు


ఇబ్రహీంపట్నం రూరల్: రూ.12.5 లక్షలకు లడ్డూ దక్కించుకున్న వైస్ చైర్‌పర్సన్ కళమ్మ


షాద్‌నగర్‌రూరల్: రూ.11లక్షల 51వేలకు లడ్డూ దక్కించుకున్న పర్వత్‌రెడ్డి


షాద్‌నగర్‌రూరల్: రూ.లక్ష71 వేలకు లడ్డూను దక్కించుకున్న యాకుబ్‌పాష


యాచారం: రూ.లక్షకు లడ్డూను దక్కుంచుకున్న శంకర్


హయత్‌నగర్: రూ.2లక్షలకు లడ్డూను దక్కించుకున్న జితేందర్‌రెడ్డి

నేడు ఉచిత కుట్టు మెషీన్ల పంపిణీ

కడ్తాల్: కడ్తాల్‌లోని ఎంబీఏ గార్డెన్‌లో శుక్రవారం ఉదయం 10గంటలకు ముస్లిం మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టుమెషీన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పీఏ నరేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరౌతారన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల్, తలకొండపల్లి మండలాలకు సంబంధించిన లబ్ధిదారులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

చేవెళ్ల: చేవెళ్లలో నేటినుంచి మూడురోజులపాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఏఎస్.రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల మండలానికి చెందిన యువత, ప్రజలకు 1000 మందికి మూడురోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఇంగ్లిష్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల మండలంలోని వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్ పక్కనే ఉన్న సిద్ధార్థ బీఈడీ కళాశాల భవనంలో శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు. వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 95506 41058 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కొందుర్గు: నిరుద్యోగ యువతీయువకుల నుంచి వృత్తివిద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ మహేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగులు అర్హులన్నారు. అక్టోబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎస్‌బీఐ రూరల్ ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో కార్ డ్రైవింగ్, సీసీ టీవీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగలవారు సంబంధిత సర్టిఫికెట్లతో చిలుకూరులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వద్ద హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 85001 65190, 79819 51167 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని లక్ష్మారెడ్డిగూడ గ్రామానికి చెందిన దెబ్బడి నర్సింహులు(65) గురువారం నిమజ్జనం సందర్భంగా వినాయకుడి విగ్రహాన్ని బావిలో స్నానం చేయించడానికి గ్రామస్తులతో కలిసి వెళ్లాడు. విగ్రహాన్ని స్నానం చేయించిన అంతరం నర్సింహులు బావిలో ఈత కొడుతుండగా బావిలోనే మునిగి మృతి చెందాడు. మద్యం సేవించి ఈత కొట్టడంతోనే మృతి చెందినట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి..

ఒకరి దుర్మరణం


సురేందర్‌రెడ్డి (ఫైల్)

షాబాద్: రోడ్డు ప్రమాదంలో బీఆర్‌ఎస్ నాయకుడు మృతి చెందిన సంఘటన షాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సురేందర్‌రెడ్డి(42) గురువారం బైక్‌పై సంకెపల్లిగూడ నుంచి షాబాద్ వైపు వస్తుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ప్రీకాస్ట్ గోడకు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన సురేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కిరాణాషాపులో మద్యం విక్రయం

నిందితుడి అరెస్టు, 95 మద్యం సీసాలు స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: నిమజ్జనాలను పురస్కరించుకుని మద్యం దుకాణాలను మూసివేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ మద్యం విక్రయిస్తున్న ఓ కిరాణా దుకాణంపై పోలీసులు దాడి చేశారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పత్లావతి శంకర్‌నాయక్ కిరాణా దుకాణం నిర్వహించడంతో పాటు మద్యం నిల్వలు ఉంచి అధిక ధరకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో గురువారం పోలీసులు దుకాణంపై దాడిచేసి మొత్తం 95 మందుబాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌కి వెల్డింగ్ చేస్తుండగా..

మంటలు అంటుకొని బైక్ దగ్ధం

షాద్‌నగర్‌రూరల్ : ద్విచక్రవాహనానికి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. స్థానికులు వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయం దుకాణ సముదాయం కాంప్లెక్స్ సమీపంలో గ్యాస్ వెల్డింగ్ షాపులో ద్విచక్ర వాహనానికి గ్యాస్ వెల్డింగ్ చేస్తుండగా బైక్‌కు నిప్పు అంటుకుంది. దీంతో మంటలు చెలరేగాయి. చుట్టు పక్కలవారు వెంటనే స్పందించి నీళ్లు పోయడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


కేశంపేట: చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని 26 చెరువులకు గాను గురువారం 6లక్షల 30వేల చేపపిల్లల పంపిణీని జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై చేపపిల్లలను చెరువుల్లో వదిలారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఏసుదాసు, అసిస్టెంట్ అంబేడ్కర్, ఫిషర్‌మ్యాన్లు యాదగిరి, మహేందర్, కొత్తపేట, కేశంపేట గ్రామాల సర్పంచ్‌లు నవీన్‌కుమార్, వెంకట్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, లక్ష్మీనారాయణగౌడ్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి

కొత్తూరు: ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని పెంజర్లలో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన స్వామివారి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అనితారెడ్డి, నాయకులు సత్యనారాయణ, జనార్దన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మధుసూధన్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జేపీ దర్గాలో..

మండల పరిధిలోని జహంగీర్ పీర్ దర్గాలో మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ ప్రాణత్యాగం చేశారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీ సమీపంలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరి, నాగార్జున్‌రెడ్డి, క్రిష్ణ, చంద్రశేఖర్, నర్సింహులు, మానిక్యరెడ్డి తదితరులు ఉన్నారు. బీజేపీ నాయకులు అత్తెల్లి అనంత్‌రెడ్డి, కుంచం శ్రీనివాస్, ప్రవీన్‌రెడ్డి, అఖిలాష్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, సమత, మధుసుధన్‌గుప్తా, గంగి యాదయ్య, రాములు, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, సాయి, భగత్‌సింగ్‌కాలనీవాసులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

గుండెపోటుతో శ్రీరామ్ చిట్స్ ఉద్యోగి మృతి


పాట్ నాయక్ (ఫైల్)

చేవెళ్ల: గుండెపోటుతో శ్రీరామ్ చిట్స్ రికవరీ మేనేజర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేవీజీ పాట్ నాయక్(54) రెండు సంవత్సరాల నుంచి చేవెళ్లలోని శ్రీరామ్ చిట్స్‌లో రికవరీ మేనేజర్‌గా పనిచేస్తూ చేవెళ్లలోని చంద్రారెడ్డినగర్‌లో ఓ గదిలో అద్దెకు ఉంటున్నాడు. అతనికి వివాహం కాలేదు ఒక్కడే ఉంటున్నాడు. గత కొన్నిరోజులుగా గుండె సమస్యతోపాటు బీపీ, షుగర్ అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిపారు. సోమవారం ఆఫీస్‌కు వచ్చి వెళ్లిన తరువాత ఆరోజు సాయంత్రం నుంచి అతడు ఎవరి ఫోన్ రిసీవ్ చేయలేదు. బుధవారం రాత్రి అతని ఇంటికి కొందరు వచ్చి చూస్తే లోపలనుంచి గడియ పెట్టి ఉంది. కిటీలోనుంచి చూడగా గదిలో మంచంపై చనిపోయి పడి ఉన్నాడు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబ్రహ్మం తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ముగ్గురికి గాయాలు

కడ్తాల్: కడ్తాల్ సమీపంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన సభావట్ శ్రీను, తన స్నేహితులు భరత్, ఉదయ్‌కుమార్‌తో కలిసి బైక్‌పై పెట్రోలు పంపునకు బయలుదేరారు. ఈ క్రమంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై హాస్టల్ కూడలి వద్ద పంపు వైపు వెళ్తుండగా.. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వేగంగా వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. యువకులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీను సోదరుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.